సాక్షి నంద్యాల

శనివారం, 10, మే, 2025



అధికారుల కళ్లల్లో 'ఇసుక'

హాలహర్వి: అక్రమార్కులు అధికారుల కళ్లల్లో ఇసుక కొట్టారు. వేదావతి నది పరివాహక ప్రాంతాల నుంచి రాత్రి సమయంలో ఇసుక తరలిస్తున్నారు. ఇందుకు పొలాల మార్గాలను ఎంచుకుంటున్నారు.



అరుదైన రోగం..అల్లకల్లోలం

లూపస్.. చిన్న, పెద్ద తేడా లేకుండా ఎవ్వరికైనా రావచ్చు. ఇది ఒక దీర్ఘకాలిక ఆటో ఇమ్యూన్ వ్యాధి. శరీరంలోని అనేక అవయవాలు, వ్యవస్థలను ప్రభావితం చేస్తుంది. 12లో▸



మధ్యంతర భృతి ప్రకటించాలి

12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. 12లో▸

న్యూస్‌రీల్

12 నుంచి ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు



మాట్లాడుతున్న డీఆర్‌ఓ రామునాయక్

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్మీడియెట్ మొదటి, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ పరీక్షలు ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటలకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఉంటాయన్నారు. ఇందుకోసం మొత్తం 42 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఓబులేసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరిలకు చెందిన అర్హులైన అభ్యర్థులు ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. టెట్ అర్హత సాధించిన అభ్యర్థులే సొంత జిల్లాలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా వెనుకబడిన తరగతులు, సాధికారత అధికారి కార్యాలయంలో దరఖాస్తులు పొంది అక్కడే సమర్పించాలని తెలిపారు. దరఖాస్తుతో పాటుగా విద్యార్హత, క్యాస్ట్, ఇన్‌కం, ఆధార్, టెట్ హాల్‌టికెట్, టెట్ మార్కిలిస్ట్ జిరాక్స్ కాపీలను జతపరచాలన్నారు.

శ్రీశైలంలో భద్రత కట్టుదిట్టం



వాహనాలను తనిఖీ చేస్తున్న దృశ్యం

శ్రీశైలంప్రాజెక్ట్: భక్తులతో నిత్యం రద్దీగా ఉండే శ్రీశైల క్షేత్రంలో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. సాక్షిగణపతి, హఠకేశ్వరం, ఫాలధార-పంచధార, శిఖరేశ్వరం తదితర ప్రాంతాల్లో నిత్యం పోలీసులు బందోబస్తు ఉండే ఏర్పాట్లు చేశారు. దేశ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో శ్రీశైలంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. శ్రీశైలంలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని ముఖద్వారం వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో, స్వంత వాహనాల్లో, కాలినడకన వచ్చే భక్తులను,ల గేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. శుక్రవారం ఉదయం నుంయి దేవస్థానం టోల్‌గేట్ వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. దేవస్థాన సెక్యూరిటీ సిబ్బందికి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

తనిఖీలు చేయరు.. నకిలీలు ఏరివేయరు!

వర్షాలు కురిస్తే ఈనెల 20 తర్వాత పత్తి సాగు

- మొదలైన బీటీ పత్తి విత్తన ప్యాకెట్ల అమ్మకాలు
- పల్లెలకు చేరుతున్న నకిలీ, లూజు విత్తనాలు
- రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు అధికం
- తమ ఆధీనంలోని కంపెనీల్లో వ్యవసాయ శాఖ తనిఖీలు
- ప్రత్యేక ఏజెంట్ల ద్వారా అమ్మకాలు

గత ఏడాది నకిలీ పత్తి విత్తనాల వల్ల జిల్లాలో వేలాది ఎకరాల్లో పంట దెబ్బతినింది. బనగానపల్లి, దొర్నిపాడు, ఎమ్మిగనూరు ప్రాంతల్లో నకిలీ విత్తనాలతో రైతులు కోలుకోలేని విధంగా నష్టపోయారు. 2023–24 సంవత్సరంతో పోలిస్తే 2024–25లో నకిలీ విత్తనాలు, లూజు విత్తనాల అమ్మకాలు, అనధికార విత్తనాలు, స్టాప్ సేల్స్ తదితరాలకు సంబంధించి పెద్ద ఎత్తున కేసులు నమోదయ్యాయి. రూ.2.40 కోట్ల విలువ చేసే పత్తి, ఇతర విత్తనాలు 100.79 క్వింటాళ్లు సీజ్ చేశారు. ఐదు 6ఏ కేసులు కూడా నమోదయ్యాయి.



గత ఏడాది పట్టుబడిన నకిలీ బీటీ పత్తి విత్తన ప్యాకెట్లు

కర్నూలు(అగ్రికల్చర్): నకిలీ బీటీ పత్తి విత్తనాలకు ఉమ్మడి జిల్లా పెట్టింది పేరు. అయినప్పటికీ వీటి ఏరివేత దిశగా అధికారులు చేపడుతున్న చర్యలు శూన్యం. ఇప్పటికే బీటీ పత్తి విత్తన ప్యాకింగ్ జరగడం, కంపెనీలు మార్కెట్‌లోకి విడుదల చేయడం జరిగిపోయింది. 25–30 శాతం వరకు అమ్మకాలు కూడా పూర్తయినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో నకిలీ విత్తనాలు కూడా ఉమ్మడి జిల్లాను ముంచెత్తుతున్నట్లు సమాచారం. రాష్ట్రంలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యధికంగా పత్తి సాగవుతుంది. నల్ల రేగడి నేలలు ఎక్కువగా ఉండటం వల్ల పత్తి సాగు కలసివస్తోంది. అయితే అధికార యంత్రాంగం కళ్లు మూసుకోవడంతో నకిలీ బీటీ పత్తి విత్తనాలు గుట్టుచప్పుడు కాకుండా గ్రామీణ ప్రాంతాలకు చేరిపోయినట్లు తెలుస్తోంది. వర్షాలు కురిస్తే ఈ నెల 20 తర్వాత పత్తి విత్తనాలు విత్తుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. అయినప్పటికీ నకిలీలను పట్టించుకునే తీరిక, ఓపిక అధికార యంత్రాంగానికి లేవనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బీటీ పత్తి విత్తనాలకు సంబంధించి కేవలం నాలుగైదు కంపెనీలకు మాత్రమే అనుమతులు ఉండగా.. అనుమతి లేని కంపెనీలు పుట్టగొడుగులను తలపిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

అక్రమార్కులపై నిఘా కరువు

ఒకసారి నకిలీ విత్తనాల వ్యాపారంలోకి అడుగు పెట్టారంటే ప్రాంతం మారుతుందే తప్ప వదలడం అంటూ ఉండదంటారు. గత ఏడాది వరకు నకిలీలు, అనధికార విత్తనాలు, లూజు విత్తనాలకు సంబంధించి వందల మందిపై కేసులు పెట్టారు. ఇలాంటి వారిపై సీజన్ వస్తుందంటే నిఘా ఉంచాల్సిన అవసరం ఎంతో ఉంది. కానీ ఆ దిశగా ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో బీటీ పత్తి దాదాపు 2.53 లక్షల హెక్టార్లలో సాగవుతుంది. హెక్టారుకు 450 గ్రాముల ప్యాకెట్లు 6–8 వరకు విత్తుకుంటారు. ఈ ప్రకారం జిల్లాకు దాదాపు 20 లక్షల ప్యాకెట్లు అవసరం. వ్యవసాయ యంత్రాంగం తమ ఆధ్వర్యంలోని డీలర్లు, విత్తన ప్రాసెసింగ్ కేంద్రాల్లో తనిఖీలు చేస్తున్నారు తప్పితే అక్రమార్కులపై దృష్టి సారించడం లేదని తెలుస్తోంది. మామూలుగా అయితే ఖరీఫ్ సీజన్‌కు నెల రోజుల ముందు నుంచి తనిఖీలు చేపట్టాలి. విత్తనాలు ట్రాన్స్‌పోర్టు కంపెనీల ద్వారా కూడా రవాణ అవుతుంటాయి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తనిఖీలు కొండెక్కాయి. నకిలీలకు గేట్లు ఎత్తారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పత్తి సాగు అంచనా

జిల్లా	హెక్టార్లు
కర్నూలు	2,34,409
నంద్యాల	18,827

కేసుల నమోదు ఇలా..

సంవత్సరం	కేసులు
2023-24	705
2024-25	791

నకిలీ బీటీ విత్తనాలకు అడ్డాగా ఉమ్మడి జిల్లా

రాష్ట్రంలోనే కర్నూలు జిల్లా నకిలీ బీటీ పత్తి విత్తనాలకు కేంద్ర బిందువుగా మారింది. ఇతర జిల్లాలకు కూడా కర్నూలు నుంచే నకిలీ బీటీ విత్తనాలు తరలుతున్నట్లు తెలుస్తోంది. అక్రమార్కులు జిన్నింగ్ మిల్లుల నుంచి పత్తి విత్తనాలు తెచ్చుకొని ప్రాసెసింగ్ చేసి రంగులు అద్ది ఆకర్షణీయమైన ప్యాకెట్లలో బ్రాండెడ్ విత్తనాలుగా మార్కెట్‌లోకి పంపుతున్నారు. ప్రత్యేక ఏజెంట్ల ద్వారా వీటి అమ్మకాలు సాగిస్తున్నట్లు సమాచారం. నకిలీ పత్తి విత్తనాలు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున దిగుమతి అవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. కొన్ని బ్రాండ్ కంపెనీలు కూడా రైతులకు నకిలీ విత్తనాలను అంటగట్టి వారి జీవితాలతో చెలగాటమాడుతుండటం గమనార్హం. బీటీ పత్తి విత్తనాలకు సంబంధించి కావేరి–జాదు విత్తనాలతో ఉమ్మడి జిల్లా రైతులు భారీగా నష్టపోయారు. ఈ విత్తనం కారణంగా నష్టపోయిన రైతులకు ఇంతవరకు పరిహారం ఇవ్వని పరిస్థితి. కర్నూలు జిల్లాలో నకిలీ విత్తనాలకు ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు డివిజన్‌లు కేరాఫ్‌గా తెలుస్తోంది.

కంపెనీ విత్తనం ఇలా గుర్తించాలి..

- ➤ ప్యాకెట్‌పై కస్టమర్ కేర్ నెంబర్ ఉంటుంది.
- ➤ ఈ నెంబర్‌కు ఫోన్ చేస్తే రింగ్ అవుతుంది.
- ➤ కంపెనీ పేరు, అడ్రస్, వెరైటీ తదితరాలను పరిశీలించాలి.

కేసు నమోదుతో సరి!

వెల్దుర్తిలో కోస్తా ప్రాంతం నుంచి వలస వచ్చిన వ్యక్తి నకిలీ విత్తన మాఫియాగా పేరొందారు. ఈయన పత్తిలో లూజు విత్తనాలతో పాటు అనుమతి లేని విత్తన ప్యాకెట్ల అమ్మకాలు చేపట్టారు. ఈ విత్తనాలు కొన్న రైతులు భారీగా దెబ్బతిన్నారు. నకిలీ విక్రేతపై పోలీసులు, వ్యవసాయ అధికారులు తని ఖీలు చేపట్టి భారీగా విత్తనాలను సీజ్ చేశారు. సీజ్ చేసిన పత్తి లూజు విత్తనాలతో పాటు అనుమతి లేని పత్తి విత్తన ప్యాకెట్లు ఇప్పటికీ వెల్దుర్తిలోని ఒక రైతుభరోసా కేంద్రంలో ఉండిపోయాయి. నకిలీ విత్తన వ్యాపారిపై జూన్ 17, 2020లో పీడీ చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఇలాంటి వారిపై నిఘా ఉంచకపోవడం అధికారుల చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోంది.

ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశాం



నకిలీ విత్తనాలు, లూజు విత్తనాలు, అనుమతి లేని విత్తనాల కోసం తనిఖీలు చేస్తున్నాం. ఇందుకోసం ప్రత్యేక టీమ్‌లు కూడా ఏర్పాటు చేశాం. వీటితో పాటు హెచ్‌టీ పత్తి విత్తనాల కోసం తనిఖీలు నిర్వహిస్తూ ఎక్కడికక్కడ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఈ ఏడాదికి సంబంధించి ఇంతవరకు అనధికార విత్తనాలు, నకిలీలు పట్టుబడలేదు. ఎక్కడైన అనుమతి లేని విత్తనాలు అమ్ముతుంటే సంబంధిత వ్యవసాయ అధికారులకు సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

– పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి, కర్నూలు



ఊరేగుతున్న ఉత్సవమూర్తులు

కమనీయం.. కాలింగ నర్తనోత్సవం



కాలింగ నర్తనోత్సవంలో కొలువైన స్వామి, అమ్మవారు

ఆళ్లగడ్డ: అహోబిలంలో లక్ష్మీనరసింహస్వామి జయంతి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం కాలింగనర్తనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువుంచి గ్రామోత్సవం జరిపారు. వేడుకల్లో భాగంగా జ్వాలానరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు తొట్టి తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులకు తిరుమంజనం వస్త్రాలతో ముస్తాబు చేశారు. అనంతరం వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య పన్నీరుతో నింపిన వెండి తొట్టిలో సప్త నదులను ఆవాహం చేస్తూ ఉత్సవమూర్తుల పాదాలను అభిషేకించారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు కార్యాచరణ

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): మాదక ద్రవ్యాల నియంత్రణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులను జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు బానిసైతే కలిగే దుష్ప్రభావాలపై పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థల్లో వీడియోలు ప్రదర్శించాలన్నారు. ప్రముఖ కూడళ్లలో హోర్డింగులు ఏర్పాటు చేయాలని, వాల్ పోస్టర్లు ప్రదర్శించాలని సూచించారు. కళాజాతా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మాదకద్రవ్యాల నివారణ కోసం జూన్ 1నుండి జూన్ 26వ తేదీ వరకు సంబంధిత అధికారులు బృందాలుగా వెళ్లి నిర్దేశించిన కార్యక్రమాలను చేపట్టాలన్నారు.. మత్తు పదార్థాల నియంత్రణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు గాను వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలను నిర్వహించాలన్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు రయిజ్ ఫాతిమా, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ రవికుమార్, డీఈఓ జనార్దన్ రెడ్డి, డీవైఈఓ సునీత, ఐసీడీఎస్ పీడీ లీలావతి, జువైనల్ హోం సూపరింటెండెంట్ హుస్సేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సహాయానికి డయల్ 15100

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణంలో ఉన్న దిశ వన్‌స్టాప్ సెంటర్, మహిళా ప్రాంగణం (శక్తి సదన్)ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడికి వచ్చిన వారితో మాట్లాడుతూ.. ఏమైనా న్యాయ సమస్యలు ఉంటే 15100 అనే టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. వన్‌స్టాప్ సెంటర్‌లో ప్రభుత్వం ద్వారా అందజేసే బాధితుల పరిహారానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాంగణంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. లీగల్ సర్వీసెస్ యాక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందేందుకు అందరూ అర్హులని చెప్పారు.

వక్ఫ్ చట్ట సవరణ మలివిడత పోరాటాలకు 21న ప్రణాళిక

కర్నూలు(సెంట్రల్): ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు వక్ఫ్ చట్ట సవరణ నిలిపివేతకు మలివిడత పోరాటాలకు సిద్ధం కానున్నట్లు సేవ్ వక్ఫ్ జేఏసీ కన్వీనర్ సయ్యద్ జాకీర్ మౌలానా రషది తెలిపారు. శుక్రవారం రిసల్దార్ మసీదులో సయ్యద్ మన్సూర్ మౌలానా అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 21న మలివిడత పోరాటాలపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన ముఖ్యనాయకులతో పాటు మండలాలు, తాలుకాల జేఏసీ నాయకులు హాజరు కావాలని కోరారు. ఆ సందర్భంగా భవిష్యత్ కార్యక్రమాలను ప్రకటిస్తామన్నారు. సమావేశంలో కోకన్వీనర్లు ఎంఏ హమీద్, మౌలానా జబీవుల్లా, మౌలానా ముస్తాక్ అహ్మద్‌ఖాన్, హఫీజ్, హుస్సేన్ సాహెబ్, ఎస్ఎండీ షరీఫ్ పాల్గొన్నారు.

యువకుడిని మింగిన బావి!




యువకుడు మృతిచెందిన బావి ఇదే



మృతుడు షేక్ బాబ్జాన్ అలియాస్ రిజ్వాన్

ఉయ్యాలవాడ: స్నేహితులతో కలిసి ఉత్సాహంగా ఉండే యువకుడిని ఓ బావి మృత్యువు రూపంలో కబళించింది. ఈ విషాద ఘటన శుక్రవారం సాయంత్రం గోవిందపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన షేక్ బాబ్జాన్ అలియాస్ రిజ్వాన్(25) అనే యువకుడు తోటి స్నేహితులతో ఈత కొట్టేందుకు గోవిందపల్లె గ్రామంలో బావికి వెళ్లాడు. ఈత రాకపోయిన నడుముకు ఖాళీ 5 లీటర్ల క్యాన్‌లు నాలుగు కట్టుకుని బావిలో దూకాడు. నడుముకు కట్టుకున్న క్యాన్‌లు తెగి పోవడంతో నీటిలో మునిగి పోయాడు. గమనించిన తోటి స్నేహితులు బావిలో గాలించగా యువకుడు లభ్యం కాలేదు. స్నేహితులు గట్టిగా కేకలు వేయడంతో గ్రామస్తులు వచ్చి బావిలో దూకి అతడిని బయటకు తీశారు. వెంటనే 108 వాహనంలో కోవెలకుంట్ల పట్టణానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యాధికారి తెలిపారు. ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన షేక్ ఖాదర్‌వలి కుటుంబ సభ్యులు అందరూ గోవిందపల్లె గ్రామంలోని అచ్చుకట్ల బుడ్డే సాహెబ్ ఇంటికి వచ్చారు. షేక్ ఖాదర్‌వలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. వీరిలో ఒక కుమారుడు మృత్యువాత పడడంతో ఆ కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

'బానకచెర్ల'కు నూతన గేట్లు



నూతన గేట్లను ఏర్పాటు చేయనున్న ప్రాంతం

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ వద్ద నూతన గేట్లు ఏర్పాటు చేయనున్నట్లు ఏఈ దేవేంద్ర శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెగ్యులేటర్ వద్ద వీబీఆర్, పాత ఎస్ఆర్‌బీసీ, కేసీసీ ఎస్కేప్ చానల్‌ల నూతన గేట్ల ఏర్పాటు కోసం రూ.15కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రస్తుతం కేసీసీ ఎస్కేప్ ఛానల్ గేట్లను రూ. 5 కోట్లతో నిర్మాణం పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఇక్కడ ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేసిన నూతన గేట్లను హైదరాబాదులో సీఈ కబీర్ బాషా స్వయంగా పరిశీలించారన్నారు. జూన్ చివరి నాటికి నూతన గేట్లను అమర్చి ఖరీఫ్‌కు నీటిని విడుదల చేయాలని కాంట్రాక్టర్‌కు సీఈ నుంచి ఆదేశాలు అందాయన్నారు.

ఒక్క పరిశ్రమ లేదు.. ఉద్యోగం రాదు

- నిరుపయోగంగా తంగడంచ ఫారం భూములు
- పదేళ్ల క్రితం అల్ట్రామెగా ఫుడ్‌పార్క్‌కు చంద్రబాబు శంకుస్థాపన
- అంబుజా భూములు ఏపీఐఐసీకి అప్పగింత
- స్థానికులకు ఒక్క ఉద్యోగం ఇవ్వని జైన్ ఇరిగేషన్ కంపెనీ
- సీడ్ హబ్ పేరుకే పరిమితం



2015 ఆగస్టు 17న అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించిన పైలాన్

జూపాడుబంగ్లా: అంతన్నారు.. ఇంతన్నారు.. పదేళ్లు గడుస్తున్నాయి. అయినా ఒక్క పరిశ్రమ రాలేదు. ఒక్క ఉద్యోగం దక్కలేదు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాటలకు.. చేతలకు పొంతన ఉండదు అనేందుకు నిదర్శనం తంగడంచ భూములు. ఎంతో సారవంతమైన భూములు నిరుపయోగంగా మారాయి. నాణ్యమైన విత్తనాలు ఉత్పత్తి చేయాల్సిన భూములు ముళ్లకంపలతో దర్శనమిస్తున్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో వందలాది ఎకరాలు కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేశారే కానీ.. ఇప్పటి వరకు ఒక్క పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం లేదు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం జిల్లాలోని తంగడంచ ఫారం భూముల్లో జిల్లాలో అల్ట్రామెగా ఫుడ్‌పార్కింగ్ చేసి జిల్లాలో 10 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ మేరకు గుజరాత్ అంబుజా పరిశ్రమకు 211.10 ఎకరాలను ఎకరా రూ.4.50 లక్షల చొప్పున విక్రయించేందుకు ఏపీఐఐసీ ఒప్పందం కుదుర్చుకున్నారు. 2015 ఏప్రిల్ 30న టీడీపీ ప్రభుత్వం జీవో నెంబర్ 152ను విడుదల చేసింది. పరిశ్రమల నిబంధనల ప్రకారం పరిశ్రమల స్థాపన కోసం పరిశ్రమలకు కేటాయించిన భూముల్లో ఆరు మాసాల్లోగా కంపెనీ స్థాపన ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. అయితే భూములను కేటాయించి మూడేళ్లు గడిచినా గుజరాత్ అంబుజా పరిశ్రమ స్థాపించకపోవటంతో ఒప్పందాన్ని రద్దు చేసి వారికి కేటాయించిన భూములను రద్దు చేసి ఏపీఐఐసీకి అప్పగించారు. వారు చిన్న, మధ్య తరహా పరిశ్రమలను స్థాపించేందుకుగాను రూ.7.5కోట్లు వెచ్చించి రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మించారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు రాకపోవటంతో ప్రస్తుతం ఏపీఐఐసీ ఆధ్వర్యంలోని 211 ఎకరాలు ముళ్లపొదలతో నిండి అడవిని తలపిస్తున్నాయి. ప్రస్తుతం కంపెనీలకు కేటాయించిన భూములు నిరుపయోగంగా మారగా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిరుపయోగంగా ఉన్న భూముల్లో ఇప్పటికైనా సీఎం చంద్రబాబునాయుడు పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగులైన యువతీ, యువకులను, రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

రూ.7కోట్ల నిధులు వృథా..

గుజరాత్ అంబుజా పరిశ్రమ స్థాపిస్తారని హడావుడిగా ఏపీఐఐసీ రూ.7.09 కోట్ల నిధులను వెచ్చించి కేజీ రోడ్డు నుంచి అంబుజా పరిశ్రమ స్థాపన భూముల వరకు 1.304 కిలోమీటర్ల మేర రెండులైన్లతో కూడిన బీటీరోడ్డును నిర్మించింది. అలాగే సుద్దవాగుపై వంతెనను ఏర్పాటు చేసింది. కేటాయించిన భూములను సర్వేచేయించి సరిహద్దులు ఏర్పాటు చేయటంతోపాటు కంపచెట్లను తొలగించేందుకు మరో రూ.కోటి నిధులను వెచ్చించారు. ఇప్పటిదాకా ఆభూముల్లో ఒక్క పరిశ్రమలను స్థాపించ లేదు. దీంతో రూ.7 కోట్ల ప్రజాధనం వృథా అయింది. ఇప్పటికైనా నిరుపయోగంగా ఉన్న భూముల్లో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



గుజరాత్ అంబుజా పరిశ్రమ కోసం నిర్మించిన రెండులైన్ల బీటీరోడ్డు



గుజరాత్ అంబుజాకు కేటాయించిన భూములు ముళ్లపొదలతో ఇలా



రహదారి నిర్మాణం కోసం ఏపీఐఐసీ వెచ్చించిన నిధుల వివరాలు తెలిపే బోర్డు

జైన్ ఇరిగేషన్ అంతే..

తంగడంచ విత్తనోత్పత్తిక్షేత్రంలోని బంగారు పంటలు పండే నల్లరేగడి భూములను అప్పటి టీడీపీ ప్రభుత్వం జైన్‌ఇరిగేషన్ కంపెనీకి 624.54 ఎకరాలు కేటాయించింది. 2017లో జైన్ కంపెనీని స్థాపించినా ఇప్పటి దాకా 50 మందికి కూడా ఉద్యోగ అవకాశాలు కల్పించిన దాఖలాల్లేవు. కేవలం ఎక్కడో పెంచిన మొక్కలు ఇక్కడికి తెచ్చి విక్రయిస్తోంది. కేవలం స్టాక్ పాయింట్‌గా భూములను వినియోగించుకుంటోంది. తంగడంచ విత్తనోత్పత్తిక్షేత్రంలో అల్ట్రామెగా ఫుడ్‌పార్కింగ్ ఏర్పాటు కోసం పైలాన్ ప్రారంభించే సమయంలో చంద్రబాబు మాట్లాడుతూ.. ఆరు మాసాల్లోగా గుజరాత్ అంబుజా పరిశ్రమతో పాటు జైన్ పరిశ్రమలను స్థాపించి ప్రత్యక్షంగా, పరోక్షంగా 10వేల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పదేళ్లు గడిచినా స్థానికులకు ఒక్క ఉద్యోగం రాలేదు. సీడ్ హబ్ పేరుతో మరో 600 ఎకరాలు కేటాయించినా ఇప్పటి వరకు ఒక విత్తనం నాటలేదు. ఒక మొక్క పెంచలేదు.

క్లుప్తంగా

సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి



మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్రచౌదరి

ఎమ్మిగనూరురూరల్: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు పాటించాలని కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్రచౌదరి, ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో ఖరీఫ్ పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్‌లో కంది, పత్తి, ఆముదం, వేరుశనగ, వరి, కొర్ర పంటల సాగులో రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. వేసవిలో లోతు దుక్కులు దున్నుకోవాలని, భూసార పరీక్షలు చేయించుకుని ఫలితాలకు అనుగుణంగా ఎరువులు, పంటలు వేసుకోవాలని సూచించారు.

కూలిన ట్యాంకుపై విచారణ



నాణ్యతను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరేరామ్ నాయక్

మంత్రాలయం: మండల కేంద్రంలో 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఓహెచ్ఆర్ ట్యాంకు నేలమట్టమైన విషయం విదితమే. ఈ ఘటనపై శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరేరామ్ నాయక్, క్వాలిటీ కంట్రోల్ నిపుణులు సత్యనారాయణ విచారణ చేపట్టారు. మంత్రాలయంలోని రాఘవేంద్రపురంలో కుప్పకూలిన ట్యాంకును పరిశీలించి నమూనాలు సేకరించారు. రూ.6 కోట్ల నిధులతో గురు రాఘవేంద్రప్రాజెక్టు కాంట్రాక్టర్ యువరాజ్ పనులు చేపట్టారు. రూ.25 లక్షల వ్యయంతో ఓహెచ్ఆర్ ట్యాంకు నిర్మాణం గా వించారు. 2017లో ట్యాంకు నిర్మాణం చేపట్టగా ఇప్పటి వరకు నీటి సరఫరా చేయలేదు. ఇటీవల తాగునీటిని ట్యాంకులో నింపగా బరువుకు కుప్పకూలింది. ట్యాంకు కూలడంతో సీఈ విచారణ చేపట్టారు. నాణ్యత లోపం అని తేలితే కాంట్రాక్టర్ నుంచి రూ.25 లక్షలు తిరిగి వసూలు చేస్తామన్నారు. ఆయనతోపాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, డీ ఈఈ మొయినుద్దీన్, ఏఈ వెంకట్రాముడు, గ్రామ సర్పంచు తెల్లబండ్ల భీమయ్య ఉన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి



మృతి చెందిన సర్వయ్య

మహానంది: మిద్దెపై నుంచి పడి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి కోలేకోలేక గురువారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. చిన్న కంబలూరు గ్రామానికి చెందిన కొమ్ము సర్వయ్య(41) మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన ఎస్తేరాణిని వివాహం చేసుకున్నాడు. అత్తమామలను చూసేందుకు గోపవరానికి వచ్చిన అతడు.. గత నెల 29న ఈదురుగాలులతో కూడిన వర్షానికి మిద్దెపైన ఉన్న వరిగడ్డి కట్టలు తడిచిపోతాయేమోనని పట్టలు కప్పేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ కిందపడ్డాడు. బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నంద్యాలకు, అక్కడి నుంచి కర్నూలుకు తరలించారు. కోలుకోలేక మృతిచెందినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అరుదైన రోగం.. అల్లకల్లోలం

- ముఖంపై సీతాకోక చిలుక ఆకారం
- లూపస్ వ్యాధితో అవయవాలపై ప్రభావం
- ప్రధానంగా కిడ్నీలకు దెబ్బ
- రోగ నిరోధక వ్యవస్థచే దాడి
- సమాజంలో ఒక శాతం మందికి వ్యాధి
- నేడు వరల్డ్ లూపస్ డే

కర్నూలు(హాస్పిటల్): లూపస్.. ఒక దీర్ఘకాలిక ఆటో ఇమ్యూన్ వ్యాధి. ఇది శరీరంలోని అనేక అవయవాలు, వ్యవస్థలను ప్రభావితం చేస్తుంది. సాధారణంగా రక్షణాధికారిగా పనిచేసే రోగనిరోధక వ్యవస్థ వ్యతిరేక దిశలో పనిచేసి ఈ వ్యాధికి కారణం అవుతుంది. దీనిని సిస్టమిక్ లూపస్ ఎరిథమాటోసస్(ఎస్ఎల్ఈ) అని కూడా పిలుస్తారు. ఈనెల 10న వరల్డ్ లూపస్ డే సందర్భంగా ఈ వ్యాధిపై ప్రత్యేక కథనం.

శరీరంలోని కణాలు, కణజాలంపై వ్యక్తి సొంత రోగనిరోధక వ్యవస్థ దాడి చేసినప్పుడు లూపస్ వ్యాధి అభివృద్ధి చెందుతుంది. దీనివల్ల గుండె, ఊపిరితిత్తులు, చర్మం, కీళ్లు, మూత్రపిండాలు, రక్తనాళాలు, మెదడు వంటి వివిధ అవయవాలు, శరీర వ్యవస్థకు హాని జరుగుతుంది. ఈ వ్యాధి సిస్టమిక్ లూపస్ ఎరిథమాటోసస్, డిస్కోయిడ్ లూపస్, సబ్ అక్యూట్ క్యూటేనియస్ ల్యూపస్, డ్రగ్ ఇండ్యూస్డ్ లూపస్, నియోనెటాల్ లూపస్ అనే రకాలుగా ఉంటుంది. ఈ వ్యాధిని చాలా మంది తమ అవగాహన లోపంతో ముందుగా గుర్తించలేకపోతున్నారు. ఈ వ్యాధితో జిల్లాలోని రుమటాలజిస్టులు, జనరల్ ఫిజీషియన్లు, నెఫ్రాలజిస్టుల వద్దకు ప్రతి నెలా 80 నుంచి 120 మంది దాకా ఈ వ్యాధి బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో దాదాపు 5వేల మంది దాకా లూపస్‌తో బాధపడుతున్నట్లు అంచనా.

లూపస్‌ను గుర్తించేందుకు..

లూపస్ ఉన్న వారిలో ముఖంపై సీతాకోకచిలుక లాంటి దద్దుర్లు, కీళ్లనొప్పులు, త్వరగా అలసిపోవడం, చాలా రోజులుగా జ్వరం, ఆకలి లేకపోవడం, జుట్టు రాలిపోవడం, గాఢంగా శ్వాస తీసుకున్నప్పుడు ఛాతిలో నొప్పి, చేతి, కాలివేళ్లు గోధుమరంగు, ఊదా రంగులోకి మారిపోవడం, నోటిలో పుండ్లు ఏర్పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరిలో కిడ్నీ, గుండె, మెదడుపై కూడా ప్రభావం చూపిస్తుంది. ఈ లక్షణాలు ఉంటే లూపస్‌గా అనుమానించి వైద్యులను కలవాలి.


లూపస్ ఎలా వస్తుంది?

సాధారణంగా జీన్స్, పర్యావరణం(ఇన్‌ఫెక్షన్స్, కొన్ని రకాల మందులు, ఒత్తిడి, అధిక యూవీ కిరణాలు) ప్రభావం వల్ల ఆటో ఇమ్యూన్ వ్యాధులు వస్తాయి. ముఖ్యంగా 15 నుంచి 45 ఏళ్లలోపు(9:1 నిష్పత్తి) ఉన్న వారిలో లూపస్ వస్తుంది. వీరిలో ఈస్ట్రోజెన్ హార్మోన్ ప్రభావం వల్ల సహజంగానే ఇది వస్తుంది. చిన్న, పెద్ద తేడా లేకుండా ఈ వ్యాధి ఎవ్వరికైనా రావచ్చు.



అణువణువూ ఇబ్బంది పెట్టే లూపస్

లూపస్‌ను సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోవాలి. ఒకవేళ సరిగా గుర్తించకపోవడం, మందులు సరిగా వాడకపోవడం వల్ల శరీరంలో క్రానిక్ ఇన్‌ఫ్లమేషన్ ఉండి అనేక అవయవాలు ప్రభావితమయ్యే అవకాశం ఉంది. కొందరిలో కిడ్నీ ప్రభావితమై మూత్రంలో ప్రొటీన్స్ ఎక్కువ మోతాదులో బయటకు వెళ్లిపోయి ఇబ్బంది అవుతుంది. మెదడు, నరాలు దెబ్బతినడం వల్ల తలనొప్పి, చూపు దెబ్బతినడం, మానసిక వ్యాధులు, పక్షవాతం, మూర్ఛ వ్యాధి లాంటివి కూడా లూపస్‌లో భాగంగా వచ్చే ప్రమాదం ఉంది. గుండెకండరాలు దెబ్బతిని హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశం ఉంది. రోగనిరోధకశక్తి తగ్గడం వల్ల ఇన్‌ఫెక్షన్స్ అధికమయ్యే అవకాశం ఉంది. రక్తసరఫరా సరిగా లేకపోవడం వల్ల ఎముకల్లో కణాలు చనిపోతాయి. ఫలితంగా సులభంగా ఎముకలు విరిగిపోతాయి. ఈ వ్యాధి ఉండే గర్భిణుల్లో అబార్షన్స్ ఎక్కువగా అవుతుంటాయి. కొందరిలో బీపీ ఎక్కువగా ఉంటుంది.



శరీరంపై లూపస్ వ్యాధి వల్ల ఏర్పడ్డ దద్దుర్లు

వ్యాధి లక్షణాలు

- లూపస్ ముందుగా చర్మం, అనంతరం కీళ్లలో మొదలుకావచ్చు.
- కొందరిలో జ్వరం, నీరసం, ఆకలి తగ్గిపోవడం వంటివి కనిపిస్తాయి.
- ముక్కుపై, చెంపపై మచ్చలు సీతాకోకచిలుక ఆకారంలో ఎర్రని దద్దుర్లు కనిపిస్తాయి.
- జుట్టురాలిపోవడం, కీళ్లనొప్పి, ఉదయం లేవగానే కండరాలు పట్టేయడం(30 నిమిషాల పాటు) వంటి సమస్యలు కూడా ఉంటాయి.
- ఇది మూత్రపిండాలు, నరాలపై కూడా ప్రభావం చూపిస్తుంది. ఒళ్లునొప్పులు, రక్తకణాలు తగ్గిపోవడం వంటి లక్షణాలూ కనిపిస్తాయి.

అపోహలు తొలగించుకోవాలి



లూపస్ పట్ల ఉన్న అపోహలు తొలగించుకోవాలి. వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి. లూపస్‌తో జీవించే రోగులకు మద్దతు ఇవ్వాలి. ఈ వ్యాధికి ఇమ్యునో సప్రెసెంట్స్, బైలాజిక్స్ మందులు వాడాలి. ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయలేం కానీ అదుపు చేయవచ్చు. ఇందుకోసం దీర్ఘకాలంగా మందులు వాడాల్సి ఉంటుంది. సాధారణ వ్యాయామం, ఎండకు తిరగకుండా ఉండటం, సన్ ప్రొటెక్షన్ క్రీమ్ వాడటం, సరైన నిద్ర, ఒత్తిడి లేకుండా ఉండటం చేయాలి.

– డాక్టర్ ఎ.సృజన, రుమటాలజిస్టు, కర్నూలు

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి



కొందరి గర్భిణుల్లో సాధారణంగా కీళ్లనొప్పులు, జ్వరం, దద్దుర్లు, అలసట, వాపు వస్తుంది. అంతమాత్రాన వీరికి లూపస్ ఉన్నట్లు కాదు. అయితే అప్పటికే లూపస్ ఉన్నట్లయితే లక్షణాలు ఎక్కువ అవుతాయి. వీరికి బీపీ పెరగడం, కిడ్నీ దెబ్బతినడం, ప్లేట్‌లెట్లు తగ్గడం, తలనొప్పి, బరువు తక్కువ ఉన్న పిల్లలు జన్మించడమే గాక కొన్నిసార్లు అబార్షన్లు అవుతాయి. లూపస్ ఉండి గర్భిణులుగా మారిన వారు సాధారణ గర్భిణుల కంటే ఎక్కువసార్లు వైద్యుల వద్ద చెకప్ చేయించుకుంటూ మందులు వాడితే వారి ప్రసవానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు.

– డాక్టర్ పి.శిరీషారెడ్డి, గైనకాలజిస్టు, కర్నూలు

స్కూటీకి నిప్పు

శ్రీశైలంప్రాజెక్ట్: కొందరు ఆకతాయిలు గురువారం రాత్రి సున్నిపెంటలోని బ్రహ్మం అనే వ్యక్తి స్కూటీకి నిప్పు పెట్టారు. మద్యం దుకాణాలకు ఎదురుగా బ్రహ్మం జనరల్ స్టోర్స్ నడుపుకుంటున్నాడు. గురువారం రాత్రి 10:30 గంటల సమయంలో కొందరు బ్రహ్మం దుకాణం వద్దకు వచ్చి మూసిఉన్న దుకాణం తెరిచి సిగరెట్లు, గ్లాసులు ఇవ్వాలని కోరారు. దుకాణాన్ని మూసేశామని బ్రహ్మం కుటుంబ సభ్యులు తెలపడంతో రెచ్చిపోయిన ఆకతాయిలు స్కూటీకి నిప్పు పెట్టారు. బాధిత కుటుంబ సభ్యులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పని ప్రదేశంలో విషపురుగులు

- భయాందోళనలో కూలీలు



చిన్నకంబలూరులో పని ప్రదేశంలో కన్పించిన పెద్ద కొండ చిలువ



పెద్దకంబలూరు వద్ద పామును చూపుతున్న మహిళా కూలీ

రుద్రవరం: మండల పరిధిలోని చిన్నకంబలూరు గ్రామ శివారులో పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు కొండ చిలువ కంట పడటంతో భయాందోళనకు గురయ్యారు. కాల్వలో పేరుకుపోయిన గడ్డిని తొలగిస్తుండగా పెద్ద కొండ చిలువ కనిపించడంతో కూలీలు పరుగులు తీశారు. అలాగే పెద్దకంబలూరులో పనులు చేస్తున్న కూలీలకు విషపురుగు కనిపించింది. కూలీలు విషపురుగును చంపేసి తిరిగి పనుల్లో నిమగ్నమయ్యారు.

సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలకు అడ్డుకట్ట





హాజరైన పోలీసు అధికారులు, ఫోరెన్సిక్ నిపుణులు , మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా

- అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా

కర్నూలు: నేరగాళ్లు సాంకేతికతను ఉపయోగిస్తున్న నేపథ్యంలో వారిని ఎదుర్కొనేందుకు పోలీసులు కూడా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఫోరెన్సిక్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై ఉమ్మడి జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల అధికారులు, దర్యాప్తు అధికారులు, స్టేషన్ రైటర్లకు శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి అడిషనల్ ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. హత్య, పోక్సో కేసులు, సైబర్ క్రైం వంటి నేరాలు జరిగినప్పుడు దర్యాప్తును పకడ్బందీగా చేపట్టాలన్నారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సరళాదేవి, ఏపీపీ ఖాదర్ బాషా, డాక్టర్ రంగయ్య, డీఎస్పీలు, ఫోరెన్సిక్ నిపుణులకు పోలీసు అధికారులు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు బాబుప్రసాద్, శ్రీనివాసాచారి, ఉపేంద్ర బాబు, వెంకటరామయ్య, రామాంజి నాయక్, ఫోరెన్సిక్ ఎక్స్‌పర్ట్స్ డాక్టర్ ఎస్.అసీం బాషా, డాక్టర్ ఎం.కిషోర్ కుమార్‌రెడ్డి, జి.శ్యాం ప్రసాద్, కుమారస్వామి, జీజీహెచ్ డాక్టర్లు, పీపీలు, ఏపీపీలు, సీఐలు, ఎస్ఐలు, ఫోరెన్సిక్ విభాగం, ఫింగర్ ప్రింట్స్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సు ఢీకొని కాడెద్దులు మృతి

- రైతుకు గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన వృషభాలు



గాయపడ్డ రైతు ఆంజనేయులు

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామం సమీపంలో శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో కాడెద్దులు మృతిచెందగా రైతు గాయాలపాలయ్యాడు. బాధితుడు తెలిపిన వివరాలు.. రాళ్లదొడ్డి గ్రామానికి చెందిన రైతు ఆంజనేయులు ఉదయం పొలానికి ఎడ్లబండితో బయలుదేరాడు. కర్నూలు నుంచి ఆదోని వైపు వెళ్తున్న ప్రైవేట్ బస్సు వేగంగా వెనుకనుంచి ఎడ్లబండిని ఢీకొంది. ప్రమాదంలో రెండు ఎద్దులు మృతి చెందగా, రైతు ఆంజనేయులుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



గువ్వల రాజు (ఫైల్)

గడివేముల: మండల కేంద్రానికి చెందిన గువ్వల రాజు అదృశ్యమయ్యాడనే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి శుక్రవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. గువ్వల రాజు (38) గ్రామంలో జీవాలు మేపుకుంటూ జీవనం కొనసాగించేవాడు. మనస్పర్థల కారణంగా భార్య బండిఆత్మకూరు మండలం ఎర్రగుంట్ల గ్రామంలో కొన్నేళ్ల నుంచి కుమారుడితో విడిగా జీవనం సాగిస్తోంది. గత నెల 26న జీవాలను మేపుకోవడానికి వెళ్లి ఇంటికి తిరగిరాలేదు. దీంతో రాజు అన్న జనార్దన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్

నందికొట్కూరు: బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు వస్తాయని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ స్వప్నప్రియదర్శిని అన్నారు. శుక్రవారం కోట వీధి, పగిడ్యాల రోడ్డు బైరెడ్డి నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికల సాధికారత–మనందరి బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. 12 నుంచి 18 ఏళ్ల బాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. చిన్న వయస్సులో గర్భం దాల్చడంతో మాతా, శిశు మరణాలకు, ఇతర ప్రమాదాలకు దారి తీస్తాయన్నారు. కార్యక్రమంలో బాలికల తల్లులు, ఎంపీహెచ్ఏఫ్ విజయలక్ష్మి, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి లావణ్య, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీదేవి, ఆశా వర్కర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలోని గోసాల వద్ద ఉంచిన పశుగ్రాసానికి గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం నిప్పుపెట్టడంతో దగ్ధమైంది. గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మహేష్‌బాబు గోశాలను నిర్వహిస్తున్నాడు. ఆవుల కోసం నిల్వ ఉంచిన రూ.2లక్షల విలువైన పశుగ్రాసాన్ని గోశాలలో నిల్వ ఉంచాడు. పశుగ్రాసం నుంచి వస్తున్న మంటలనను గమనించిన స్థానికులు ఆర్పేందుకు యత్నించినా ప్రయోజనం లేకపోయింది. ఆత్మకూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే పశుగ్రాసం పూర్తిగా కాలిపోయింది.

మధ్యంతర భృతి ప్రకటించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రారెడ్డి, కేవీ శివయ్య, రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు విద్యారంగంలో సంస్కరణల పేరుతో కూటమి ప్రభుత్వం గందరగోళ పరిస్థితులను సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం తీసుకున్న సంస్కరణ విధానాలతో పాఠశాల విద్యకు నష్టం కలుగుతుందన్నారు. విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తిని ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఈనెల 14న విజయవాడలో ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం డీఆర్‌ఓ రామునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు భాస్కరరెడ్డి, జాకీర్‌హుసేన్, మధు, రమేష్, శైలజ, రాములమ్మ, రమాబాయి, సునిత తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై రాకపోకల పునరుద్ధరణ



హైవేపై రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

కల్లూరు: సూరత్ – చెన్నై జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా లక్ష్మీపురం సమీపంలో నిర్మిస్తున్న అండర్‌గ్రౌండ్ టన్నెల్ కూలి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిన విషయం పాఠకులకు విదితమే. అధికారులు శుక్రవారం రోడ్డును డివైడ్ చేసి వాహనాలు వన్‌వేలో వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. రింగ్ రోడ్డు నుంచి కృతుంగ హోటల్ వరకు వన్‌వేలో వాహనాల రాకపోకలను పునరుద్ధరించడంతో ప్రయాణికులు ఎలాంటి ఇబ్బంది లేకుండా గమ్యస్థానాలకు వెళ్లారు.





గదిలో భద్రపరిచిన పొగాకు బేళ్లు, డి.కొట్టాలలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్ర భవనం

గోదాముగా అంగన్‌వాడీ కేంద్రం

రుద్రవరం మండలం డి.కొట్టాల గ్రామంలోని ఈ భవనం.. గోదాము అనుకుంటే పొరపాటే. చిన్నారుల కోసం నూతనంగా నిర్మిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం అది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు కింద మొదటి విడతగా శ్రీరంగాపురం, డి.కొట్టాల, ముత్తలూరు, నర్సాపురం, పేరూరు, కొండమాయపల్లె గ్రామాలకు అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు చేసి, ఒక్కో భవన నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున విడుదల చేసింది. కాంట్రాక్టర్లు నిర్మాణాలు చేపట్టారు. భవనాలు వివిధ దశల్లో ఉండగా ప్రభుత్వం మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా పైసా నిధులు విదిల్చకపోవడంతో భవన నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. చిన్నారులకు ఉపయోగపడాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు ఇలా నిరుపయోగంగా మారడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– రుద్రవరం

అక్రమ మద్యం, నాటుసారా పట్టివేత



మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

కర్నూలు: ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించి 48 మద్యం బాటిళ్లు, 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ సీఐ చంద్రహాస్, ఈఎస్‌టీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్ తదితరులు తమ సిబ్బందితో బృందాలుగా ఏర్పడి శుక్రవారం వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. కాల్వ గ్రామ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా వైకే తండాకు చెందిన లౌడ్య నరేష్ నాయక్ ద్విచక్ర వాహనంపై 30 లీటర్ల నాటుసారాను తీసుకెళ్తూ ఎక్సైజ్ అధికారులను చూసి బైక్, సారాను వదిలేసి పారిపోయాడు. సారాతో పాటు బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. కర్నూలు మండలం మునగాలపాడు గ్రామంలో నిర్వహించిన తనిఖీల్లో మధుక్రిష్ణను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 48 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని జైలుకు పంపారు. దాడుల్లో కర్నూలు ఎక్సైజ్ స్టేషన్స్ ఎస్ఐ నవీన్ బాబు, సిబ్బంది మురహరి రాజు, చంద్రపాల్, ఈరన్న, మధు పాల్గొన్నారు

జనవిజ్ఞాన వేదిక వర్క్ షాప్‌ను విజయవంతం చేయండి

డోన్ టౌన్: ఈనెల 11న స్థానిక శ్రీసుధ సీబీఎస్‌సీ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో నిర్వహించనున్న జనవిజ్ఞాన వేదిక నాలుగు జిల్లాల ప్రాంతీయ వర్క్ షాప్‌ను విజయవంతం చేయాలని వేదిక రాష్ట్ర కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి కోరారు. కొత్తపేట జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన వర్క్ షాపు నిర్వాహణపై కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల జన విజ్ఞాన వేదిక నాయకులు, కార్యకర్తలతోపాటు మాజీ శాసన మండలి సభ్యులు, ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర రామారావు పాల్గొననున్నట్లు తెలిపారు. సమావేశంలో డివిజన్ అధ్యక్షులు సర్వజ్ఞమూర్తి, నాయకులు ఎస్ఎస్ బాబు, జిల్లా నాయకులు లతీఫ్, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఏటా బెస్ట్ కాలేజీ అవార్డు

- ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్



డాక్టర్ పి.చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న దంత వైద్య కళాశాల అధ్యాపకులు, సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): ఏటా ప్రతిభ కనపరిచిన కాలేజీకి బెస్ట్ కాలేజ్ ఆఫ్ యూనివర్సిటీ అవార్డు అందజేస్తామని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన నగర శివారులోని జి.పుల్లారెడ్డి దంత వైద్యకళాశాలను సందర్శించారు. ముందుగా జి.పుల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ కాలేజీని అభివృద్ధి పథంలో నిర్వహిస్తున్నారని అభినందించారు. అనంతరం జి.నారాయణమ్మ పుల్లారెడ్డి ఆడిటోరియంలో జరిగిన ఉపాధ్యాయ, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో కాలేజీలో దంత వైద్యపరికరాలు, మౌలిక సదుపాయాలు, వీటితో పాటు అనుభవజ్ఞులైన బోధనా సిబ్బంది ఉండటం సంతోషకరమన్నారు. రీసెర్చ్ విద్యార్థులకు అమరావతిలో కొత్తగా ఏర్పాటు చేసిన రీసెర్చ్ యూనిట్‌లో అవకాశం కల్పించి ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. శిక్షణపై ఆసక్తి ఉన్న సీనియర్ రిటైర్డ్ ప్రొఫెసర్‌ను ప్రోత్సహిస్తూ వారి సేవలను ఉపయోగించుకునేందుకు ప్రొఫెసర్ అమెనిటీస్ సౌకర్యం తీసుకొచ్చామన్నారు. అనంతరం డాక్టర్ చంద్రశేఖర్‌ను కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మురళీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగలక్ష్మిరెడ్డి, ఆర్థోడాంటిక్స్ హెచ్‌ఓడీ డాక్టర్ ఎం.భారతి, డాక్టర్ దుగ్గినేని శ్రీనివాసులు, డాక్టర్ వి.సాయిరామ్ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.